క్లుప్తంగా

13న జాతీయ లోక్అదాలత్

తంబళ్లపల్లె: స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో 13వ తేదీ జాతీయ లోక్అదాలత్ నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ మండల న్యాయసేవా సంఘం అధ్యక్షుడు, స్థానిక న్యాయమూర్తి హసి ఫాసుల్తాన ఒక ప్రకటనలో తెలిపారు. క్రిమినల్, సివిల్, కాంపౌండబుల్, ఎన్ఐయాక్టు, బ్యాంకు రికవరీ కేసులను ఇరువార్గల సమ్మతితో పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసులకు కోర్టు ఫీజు చెల్లిస్తారన్నారు. అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెద్దమండ్యం ఎస్ఐగా వినోద్‌కుమార్

పెద్దమండ్యం: పెద్దమండ్యం ఎస్ఐగా వినోద్‌కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. లక్కిరెడ్డిపల్లె ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఆయనను పెద్దమండ్యం ఎస్ఐగా నియమిస్తూ జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు ఆదేశాలిచ్చారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ పి. వెంకటేష్‌ను మదనపల్లె తాలూకా పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకొంటానని ఎస్ఐ హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు.

ఎస్ఐగా రవీంద్రబాబు

పెద్దతిప్పసముద్రం: పీటీఎం ఎస్ఐగా రవీంద్రబాబు బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో రామసముద్రం మండలంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న మధురామచంద్రుడు రాయచోటి ఎస్‌బీ ఎస్ఐగా వెళ్ళారు. ఈ సందర్భంగా నూతన ఎస్ఐ సోమవారం మాట్లాడుతూ మండలంలో శాంతి, భద్రతలను పరిరక్షిస్తామన్నారు.

రేపటి నుంచి ఆలయంలో ఉత్సవాలు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని కందుకూరులో వెలసిన శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో ఈ నెల 3, 4 తేదీలలో ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. 3న గంగ పూజ, గణపతి పూజ, స్వస్తి వాచన, మహా గణపతి హోమం, గోపుర కలశానికి క్షీరాభిషేకం, మూల మంత్ర హోమం, అష్టావధాన సేవ,మహా మంగళ హారతి,4న యంత్ర స్థాపన, గోపుర కలశ స్థాపన, గోపూజ, మహా పూర్ణాహుతి పూజ, కుంభాభిషేకం, లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ నిర్వాహకులు పేర్కొన్నారు.

కారు మెకానిక్‌కు తీవ్రగాయాలు

మదనపల్లె : కారు రిపేరు చేస్తుండగా రేడియేటర్ కూలెంట్ ఆయిల్ మీద పడి మెకానిక్‌కు తీవ్రగాయాలైన సంఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. గుర్రంకొండ మండలం కండ్రిగకు చెందిన జాఫర్‌అలీ కుమారుడు యూసుఫ్ (22) పట్టణంలోని బసినికొండలో కారు మెకానిక్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం కారు రిపేరి చేస్తుండగా కూలెంట్ ఆయిల్ మీద పడి తీవ్రంగా గాయపడ్డాడు. శరీరం బాగా కాలి బొబ్బలెక్కింది. గమనించిన స్థానికులు వెంటనే ఆటోలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

సీఐటీయూలో చేరిన ఆశాకార్యకర్తలు

మదనపల్లె : ఏఐటీయూసీ నుంచి పలువురు ఆశా కార్యకర్తలు సోమవారం సీఐటీయూలో చేరారు. మేడే సందర్భంగా మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో జరిగిన సమావేశంలో ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, సీఐటీయూలో చేరిన ఆశాకార్యకర్తలు రేఖ, కవిత, ఇందిరా, ఇంద్రాణి, షీబా, లక్ష్మీదేవి, గౌరమ్మలను కండువా వేసి ఆహ్వానించారు. ఆశావర్కర్ల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా సీఐటీయూ రాజీలేని పోరాటం చేస్తుండటంతో పార్టీలో చేరినట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు జయమ్మ మాట్లాడుతూ. ఆశాకార్యకర్తలపై పనిభారం పెరిగిందని, ఆశాలు ఐక్యంగా పోరాడితే కనీస వేతనాలు, ఉద్యోగభద్రత సాధించుకోవచ్చని తెలిపారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, ఆశాకార్యకర్తలు చంద్రకళ, మల్లీశ్వరి, మంజుల, విమల తదితరులు పాల్గొన్నారు

ఘనంగా ఆంజనేయస్వామి తిరునాల

కేవీపల్లె : మండలంలోని కేవీపల్లె కస్బాలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి తిరునాల ఘనంగా నిర్వహించారు. ఆదిరాత్రి రాత్రి నుంచి సోవారం ఉదయం వరకు ఆలయంలో విశేష పూజలు చేశారు. రాత్రి భక్తుల కాలక్షేపానికి చిన్నమ్మ కథన నాటకం ఏర్పాటు చేశారు. భక్తులు చాందినీబండ్లు కట్టి స్వామివారికి మొక్కుబడులు చెల్లించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వెంకటరమణ, వెంకటలక్ష్మమ్మ, దర్శిత్, మోక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరులో మహాభారత యజ్ఞం

పీలేరు రూరల్ : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ధ్వజారోహణ కార్యక్రమంతో మహాభారత యజ్ఞం ప్రారంభమైంది. ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహాభారత యజ్ఞం ప్రారంభించారు. సోమవారం మధ్యాహ్నం భాగవతారిణి మునిలక్ష్మీచే మొదటి రోజు వ్యాస జననం ఘట్టంపై హరి కథాగానం చేశారు. రాత్రి భక్తుల కాలక్షేపానికి వెంకటేశ్వర నాట్యకళామండలిచే శ్రీకృష్ణ లీలలు నాటకం నిర్వహించారు.

చేనేతల శ్రేయస్సుకు ప్రభుత్వం కృషి

- దేశంలో ఎక్కడా లేని విధంగా నేతన్న నేస్తం
- ఉచితంగా ఆధునిక పరికరాలు
- ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

కురబలకోట: నేతన్నల శ్రేయస్సు కోసం సీఎం జగన్ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పేర్కొన్నారు. మేడేను పురస్కరించుకుని మండలంలోని అంగళ్లు జెడ్పీ హైస్కూల్‌లో చేనేత క్లస్టర్ అభివృద్ధి పథకం కింద సోమవారం మూడవ అవగాహన సదుస్సు, మొదటి విడత హెచ్ఎస్ఎస్ పనిముట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ రంగం తర్వాత చేనేత రంగం ఎక్కువ మందికి జీవనోపాధిని కలిప్తోందన్నారు. చేనేత అభివృద్ధి, సంక్షేమం కోసం జగన్ ప్రభుత్వం ఇతోధికంగా కృషి చేస్తోందన్నారు. నేతన్న నేస్తం కింద ఏడాదికి రూ. 24 వేలు ఇస్తుండడం గొప్ప విషయమన్నారు. దేశంలో మరెక్కడా ఇలాంటి పథకం లేదన్నారు. ఈ రంగం సంస్కృతి, సంప్రదాయాలను కూడా ప్రతిబింబిస్తోందన్నారు. కంచి, ధర్మవరం, బెనారస్ పట్టు వస్త్రాల పేరుతో ఖ్యాతి గాంచిందన్నారు. 50 ఏళ్లకే వృద్ధాప్య ఫించన్ కూడా ఇస్తున్నారన్నారు. 90 శాతం సబ్సిడీతో ఆధునిక పనిముట్లు ఇవ్వడం ద్వారా నేతన్నలకు శారీరక శ్రమ తగ్గడంతో పాటు సమయం కూడా కలసి వస్తుందన్నారు. వివిధ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నేతన్నలు వినియోగించుకుని జీవనాన్ని, జీవితాలను మలచుకుని అభివృద్ధి చెందాలని కోరారు. చేనేత భవన్ ఏర్పాటుకు సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 268 మందికి ఆధునిక పనిముట్లు పంపిణీ చేశారు. అంతకు ముందు ఎమ్మెల్సీ పి. చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చేనేత రంగానికి జగన్ ప్రభుత్వం చేయూతను ఇస్తోందన్నారు. మేడే సందర్భంగా అంగళ్లులో కొత్తగా ఆటో స్టాండ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆర్‌డీడీ రాజారావు, జిల్లా ఏడీ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ బైసాని జ్యోతి, బైసాని చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ బి. దస్తగిరి, పోరెడ్డి విశ్వారెడ్డి, ఎన్‌వి. రమణారెడ్డి, డీఆర్. ఉమాపతిరెడ్డి,ఆర్కే కృష్ణారెడ్డి, సుక్కా సుజాత, సుభాషిణి, ఫిరోజ్‌ఖాన్, ఫజరుల్లా, ఈశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలను ప్రజలకు చేరువ చేసిన వలంటీర్లు

కురబలకోట: వివిధ ప్రభుత్వ పథకాలను గ్రామ వలంటీర్లు ప్రజలకు చేరువ చేశారు. జనం మెచ్చుకునేలా మరింతగా పనితీరు మెరుగు పరచుకోవాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి సూచించారు. కురబలకోట మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో గ్రామ వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వలంటీర్ల ద్వారా వివిధ పథకాలు అందుతుండడంతో ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభిస్తోందన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. ప్రజల నుంచి వచ్చే వినతులను వెంటనే పరిష్కరించాలన్నారు.

సీఎం జగన్‌కు ప్రజల్లో విశేష ఆదరణ

తంబళ్లపల్లె: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో విశేష ఆదరణ ఉంది. మళ్లీ..మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌నే ఉండాలని, ఆయన సంక్షేమ పాలనలో అన్ని కుటుంబాలు అభివృద్ధితో పాటు ఆనందంగా ఉన్నామని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారు. సోమవారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, గుండ్లపల్లె పంచాయతీలోని చెట్లవారిపల్లె, వేమారెడ్డిగారిపల్లె, పాతరెడ్డిగారిపల్లెల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో చేకూరిన లబ్ధి వివరాలు ఆరా తీశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను సంబంధిత అధికారులతో అక్కడే పరిష్కరించారు. పలువురికి 2 నెలలుగా రేషన్ సరుకులు పంపిణీ చేయడంలేదని ఎండీయూ, డీలర్ , సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్డీవో మురళికి ఫోన్‌లో సమస్యను వివరించారు. ప్రతి ఒక్కరికి రేషన్‌సరుకులు సకాలంలో అందేలా చూడాలన్నారు. ప్రజలు వైఎస్సార్‌సీపీని మరోమారు అధిక మెజారీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచు మౌలాలి, మండల కన్వీనర్ చౌడేశ్వర్ , సింగిల్‌విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి , మల్లయ్యకొండ చైర్మన్ మల్‌రెడ్డి, నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షుడు జయసింహారెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో ఆనంద్‌కుమార్, ఎంఈవో త్యాగరాజు, నాయకులు నారాయణరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రామూర్తి, కరీమ్ తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై వెంకటేశ్వరుడు


గజవాహనంపై ఊరేగుతున్న వెంకటరమణస్వామి

మదనపల్లె సిటీ: స్థానిక దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం వాల్మీకివీధికి చెందిన ఉభయదారులు వ్యవహరించి స్వామిని గజవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. ఓ వైపు వర్షపు చినుకులు పడుతున్నా భక్తులు గోవింద నామస్మరణతో స్వామిని దర్శించుకుని పునీతులయ్యారు. ఉదయం పూలవీధి, క్రిష్ణ విద్యాలయంవీధి, పోతులప్పవీధి, అప్పారావుతోటకు చెందిన ఉభయదారులుగా స్వామిని చిన్న శేషవాహనంపై పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమణ, అర్చకులు గోవర్ధన్‌భట్టార్,ఆలయ మాజీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్పందన సమస్యలను పరిష్కరించండి

– ఆర్డీఓ ఎం.ఎస్.మురళి


స్పందనలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా పట్టణంలోని 32వవార్డు దిగువ కురవంక కొళ్లఫారం దగ్గర చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా తయారైందని, ఎగువ కురవంకకు, దిగువ కురవంకకు మధ్య ఓ వ్యక్తికి రోడ్డుకు అడ్డుగా రేకుల షెడ్ వేయడంతో దారి లేక మున్సిపల్ చెత్తవాహనాలు రావడం లేదని స్థానికులు ఫిర్యాదు చేశారు. అలాగే కలికిరిలో ఓ టీచర్ ఎస్సీ కాలనీలో రోడ్డుకు అడ్డుగా ఇంటి నిర్మాణం చేస్తున్నాడని ఆర్డీఓకు అర్జీ సమర్పించారు. మున్సిపాలిటీలో జరిగిన స్పందనలో... ప్రశాంత్‌నగర్ 9వక్రాస్‌లో రోడ్డు తగ్గుఅవడంతో వర్షపు, మురికినీరు నిలుస్తోందని, రాకపోకలకు ఇబ్బందిగా ఉందని చైర్‌పర్సన్ మనూజారెడ్డికి ఫిర్యాదుచేశారు. బెంగళూరు బస్టాండులో పూలఅంగడి స్థలాన్ని ఆక్రమించారని, రామారావుకాలనీలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని తొలగించాలని కొందరు బెదిరిస్తున్నారని అర్జీలు అందాయి. వీటిని తక్షణమే పరిష్కరించాల్సిందిగా మున్సిపల్ సిబ్బందిని చైర్‌పర్సన్ ఆదేశించారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగు

గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


కోటపల్లిలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం : నవరత్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తూ నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని చింతపర్తి గ్రామం మజరా కోటపల్లి, తాళ్ళపల్లి, నాయనివారిపల్లిలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చింతల వెళ్లి అవ్వా పెన్షన్ అందిందా ? అక్కా వైఎస్సార్ చేయూత అందిందా ? వైఎస్సార్ ఆసరా ఆదుకుందా ? అంటూ అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ కులమతాలు, పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే సంకల్పంతో సీఎం జగనన్న అడుగులు వేస్తున్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు పాలనంతా అవినీతి, మోసం, అబద్ధాలతో సాగిందన్నారు. 2014 ఎన్నికల్లో హామీలను గుప్పించి, అధికారం చేపట్టిన వెంటనే ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. ఇప్పుడు మళ్లీ తాను అధికారంలో కొస్తే ప్రజలకు మరింత మేలు చేస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో మంచి పారిపాలన సాగుతున్నప్పటికీ చంద్రబాబు, దత్తపుత్రుడు పవన్ ఎల్లో మీడియా అసత్యాలను ప్రచారం చేస్తు రాజీయ లబ్ధి పొందాలని యత్నిస్తున్నారన్నారు, ప్రజలు అంతా తెలుసునని, వారు ఎన్ని నాటకాలాడినా మోసపోరన్నారు. అనంతరం నాయనివారిపల్లి గ్రామస్తులకు ప్రభుత్వం ప్రతిష్టకత్మంగా తీసుకున్న పొజిషన్ (హక్కుదారుల పత్రము) ప్రభుత్వం తరపున అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో షబ్బీర్ అహమ్మద్, నాయకులు ఓరుగంటి రమేష్, రామక్రిష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, శ్రీనాథరెడ్డి, వెంకట్రమణ, కిరణ్‌కుమార్, మోహన్‌రెడ్డి, చెంగల్ రెడ్డి, నల్లంకి నరసింహులు, మెంబరు శీనా, ఫరూక్, నీళ్ళ భాస్కర్, కేశవ రెడ్డి, రాయుడు, ఆనందలు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే వైఎస్సార్ సీపీ ధ్యేయం

– మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి


మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎర్రజెండా ఎగురవేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి

మదనపల్లె : శ్రామికుల పండుగ అయిన ప్రపంచ కార్మిక దినోత్సవ(మేడే) వేడుకలను కార్మికలోకం ఘనంగా జరుపుకుంది. సోమవారం మేడే సందర్భంగా పలు కార్మికసంఘాలు, నేతల ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ, ర్యాలీలు, అన్నదానాలతో పండుగ వాతావరణంలో వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట జరిగిన మేడే వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్ చైర్మన్ జింకాచలపతి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమన్నారు. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముందుకెళుతున్నారన్నారు. అవుట్‌సోర్సింగ్ కార్మికులను అప్కాస్ పరిధిలోకి తీసుకురావడంతో పాటు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వేతనాలను పెంచి ఉద్యోగభద్రత కల్పించారన్నారు. సీఐటీయూ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో మదనపల్లె పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో 38చోట్ల మేడేను ఘనంగా నిర్వహించారు. కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం లేబర్‌కోడ్‌ల పేరుతో కార్మికహక్కులను దెబ్బతీయాలని కేంద్రప్రభుత్వం చూస్తోందని, మోదీ ప్రభుత్వ విధానాలను పోరాటాలతో అడ్డుకోవాలన్నారు. మేడే స్ఫూర్తితో లేబర్‌కోడ్‌లను తిప్పికొట్టేందుకు ఐక్యంగా పోరాడాలన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు కృష్ణప్ప మాట్లాడుతూ..కార్మికసంఘాలు సాధించుకున్న కార్మికహక్కులు, చట్టాలను కార్పొరేట్ ప్రయోజనాల కోసం బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చిందన్నారు. కేంద్రప్రభుత్వ కార్మికవిధానాలకు వ్యతిరేకంగా కార్మికులందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరు రఫీ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు టి.హరిశర్మ, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్‌యూనియన్ రాజేశ్వరి, సీపీఎం పట్టణ కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి, ఆశావర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు జయమ్మ, వెంకటేష్, రమణరావు, ఏఐటీయూసీ నాయకులు దేవా, సూరి, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డులు అందించాలి

ములకలచెరువు: కళాకారులకు ప్రభుత్వం గుర్తింపు కార్డులు అందించాలని అన్నమయ్య జిల్లా సాంస్కృతిక కళాకారుల సంఘం అధ్యక్షుడు ఎన్.సుధాకర్‌రెడ్డి కోరారు. సోమవారం స్థానిక మండల కేంద్రం సీఎల్ఆర్‌సీ భవనంలో తంబళ్లపల్లె నియోజకవర్గంలోని కళాకారులతో కత్తి శివమణి అధ్యక్షత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కళాకారులకు టీటీడీ వారు ఉచితంగా రెండు లడ్డూలు, ప్రవేశ దర్శనం కల్పించాలని కోరారు. కళాకారులకు రూ.5 వేల ఫించన్ అందించాలని కోరారు. అనంతరం ములకలచెరువు మండల నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా గోవిందు, ఉపాధ్యక్షుడిగా ఆర్.బాస్కర్, కార్యదర్శి రమణ, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సాయిలీలా, సర్పంచు రహమత్‌బీ, మాజీ సర్పంచు రవీంద్రారెడ్డి, బి.కొత్తకోట, పీటీయం, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట మండలాధ్యక్షులు రమణ, కే.మల్‌రెడ్డి, రమణకుమార్, ఈశ్వరయ్య, రెడ్డిశేఖర్, కళాకారులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని నవాబుకోట పరిసరాల్లో పోలీసులు సోమవారం పేకాట స్థావరంపై దాడులు నిర్వహించారు. దాడిలో ఎనిమిది మంది జూదరులు పట్టుబడగా వారిని అరెస్టు చేసి వారి వద్ద లభించిన రూ.13 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

బాధితులకు ఎంపీ రూ.3.50 లక్షల ఆర్థిక సాయం


బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

గుర్రంకొండ: మండలంలోని పలు గ్రామాలకు చెందిన బాధితులకు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి రూ.3.50 లక్షల ఆర్థిక సాయం అందించారు. మండలంలోని సంగసముద్రం, ఎల్లుట్ల, టి.పసలవాండ్లపల్లె గ్రామాల్లో ఇటీవల రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహించారు. అప్పట్లో పలువురు బాధితులకు, ఆలయాలకు, మసీదులకు వ్యక్తిగత సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈనేపథ్యంలో సోమవారం రాష్ట్ర ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, ఎంపీ పీఏ బాలకృష్ణమరాజు ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోలేని దళితులు, అంధులు, ఇతర వ్యక్తిగత సాయం కోరిన బాధితులతో పాటు ఆలయాలకు, పీర్లచావిడ్లకు ఎంపీ తరపున ఆయన అందించిన ఆర్థిక సాయాన్ని వారికి స్వయంగా అందజేశారు. అనంతరం గడప, గడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజలకు ఇచ్చిన హామీలనూ, ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీ పీఏలు తేజ, దస్తగిరి, జెడ్పీటీసీ సద్దీమ్ ముక్తియార్, మండల ఆర్బీకే చైర్మన్ జయచంద్రారెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు కందుల గుణశేఖర్, అప్పల్ల, మండల సచివాలయాల కన్వీనర్ నాగేంద్ర, మాజీ ఎంపీపీలు నక్కాచంద్రశేఖర్, జమీర్, వైస్ ఎంపీపీ కరుణాకర్, సింగిల్‌విండో డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, ఎంపీటీసీలు రాజగోపాల్, యాకూబ్, , ఖదీర్,సింగంశెట్టి రెడ్డికుమార్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధికి కృషి చేద్దాం

– ఏఎంసీ చైర్మన్ యల్లయ్య


మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ చంద్రగిరి యల్లయ్య

పీలేరు : మార్కెట్ కమిటీ అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని ఏఎంసీ చైర్మన్ చంద్రగిరి యల్లయ్య అన్నారు. సోమవారం స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో నూతనంగా ఏర్పడిన పాలకమండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో మార్కెట్ యార్డును మరింత అభివృద్ధి చేస్తామన్నారు. యార్డులో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పశువులు, గొర్రెలు, మేకలకు సంత రోజు తాగునీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. రైతులు, వ్యాపారులకు అనువుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కోళ్ల వ్యాపారులకు గేటు వసూళ్ల నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు చెప్పారు. ఇకపై కోళ్లకు గేటు వసూలు ఉండదని తెలిపారు. మార్కెట్ కమిటీ అభివృద్ధికి సిబ్బంది సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ రమేష్‌రెడ్డి, సభ్యులు కాలనీ చిన్న, నరేష్‌రామకుమార్‌రెడ్డి, మునీర్, మల్లికార్జున, బాలసుబ్రమణ్యం, సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐకమత్యమే కార్మికుల బలం

– ఘనంగా మే డే వేడుకలు



ములకలచెరువులో మే డే నిర్వహిస్తున్న కార్మికులు, పీలేరులో వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో ..

ములకలచెరువు: ఐకమత్యమే కార్మికుల బలమని కార్మిక సంఘం నాయకులు అన్నారు. సోమవారం కార్మికుల దినోత్సవాన్ని మండలంలోని కార్మికులందరూ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బస్టాండు సర్కిల్ వద్ద సీఐటీయూసీ, బిల్డింగ్ వర్కర్స్, ఆటోస్టాండు యూనియన్ నాయకులు ఎర్రజెండా ఆవిష్కరించి నినాదాలు చేశారు. అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయుకులు వేణుగోపాల్‌రెడ్డి, అంజనప్ప మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల కోసం కొత్త చట్టాలు తీసుకొచ్చి వారిని ఆదుకోవాలని కోరారు. కార్మికులకు పింఛన్లు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలి ప్రభుత్వాలను కోరారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీసీటీయూ కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో కార్మక జెండాను ఆవిష్కరించారు. నినాదాలు చేస్తూ మే డే కార్యక్రమం గురించి వివరించారు. అనంతరం ఆటోలకు జెండాలు కట్టి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ కార్యదర్శి పరమేష్, భవన నిర్మాణ కార్యదర్శి శివకుమార్, రమణయ్య, షఫీ, రమణప్ప, షంషీర్, మధు, వెంకటేష్, రామాంజులు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో..

పెద్దతిప్పసముద్రం: స్థానిక ఎంఆర్‌సీ ఆవరణంలో సోమవారం కార్మికులు మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) తో కార్మికల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ మే డే విశిష్టతను జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్రబాబు వివరించారు. మండల కార్యదర్శి శంకర్, అంగన్‌వాడీ వర్కర్స్ నళిని, శాంతమ్మ, శ్రీవాణి, సరస్వతితో పాటు స్వచ్ఛభారత్ కార్మికులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లెలో..

నిమ్మనపల్లె : మండలంలోని రాచవేటివారిపల్లె పంచాయతీ గుండ్లబురుజు వడ్డిపల్లెలో మేడే వేడుకలను ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి శోభ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కూలీలతో కలిసి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఉపాధిహామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించారు. పనిదినాలను 200 రోజులకు పెంచాలని డిమాండ్ చేశారు.

ఘనంగా కార్మికుల దినోత్సవం

పీలేరు : పట్టణంలో వివిధ యూనియన్ల ఆధ్వర్యంలో కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌టీయూసీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ అసంఘటిత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. కార్మికులను అన్ని విధాలా ప్రభుత్వం ఆదుకుంటున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌టీయూసీ జిల్లా కార్యదర్శి చిన్నయల్లప్ప, నియోజకవర్గ అధ్యక్షుడు జయరామచంద్రయ్య, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు చిన్నమ్మ, ఏఎంసీ చైర్మన్ యల్లయ్య, మహితా ఆనంద్, మునీర్, కాలనీ చిన్న, కంభం భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. అలాగే బహుజన సంక్షేమ సంఘం నాయకులు బలరాం ఆధ్వర్యంలో, ఏఐటీయూసీ నాయకులు నరసింహులు ఆధ్వర్యంలో వేర్వేరుగా ర్యాలీలు నిర్వహించారు. అలాగే ఎస్టీయూ, యూటీఎఫ్ ఆధ్వర్యంలోనూ మే డే నిర్వహించారు.

బి.కొత్తకోటలో..

బి.కొత్తకోట : బి.కొత్తకోట పట్టణంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడేను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పీటీఎం రోడ్డులో ఏఐటీయూసీ జెండాను ఉమ్మడి చిత్తూరు జిల్లా మాజీ అధ్యక్షులు ఎస్.మనోహర్‌రెడ్డి ఎగురవేశారు. హక్కుల సాధన కోసం పోరాటాలకు కార్మికవర్గం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పట్టణంలో కార్మికులు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గపు సమితి అధ్యక్షులు ఎస్.సలీంబాషా, మండల అధ్యక్ష, కార్యదర్శులు అష్రఫ్‌అలీ, తంబయ్యశెట్టి, అనుబంధ కార్మికసంఘాల నాయకులు హెచ్.సమీవుల్లా, రఘునాథ్, కే.రామాంజులు, జి.నారాయణస్వామి, కే.రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సారా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం


రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్ఈవో విజయశేఖర్

పీలేరు రూరల్ : సారా తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు సెబ్ జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ (డీఎస్ఈవో) టి. విజయశేఖర్ అన్నారు. సోమవారం పీలేరు సెబ్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పలు సారా కేసుల్లో పట్టుబడ్డ వాహనాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా జాడ లేకుండా చేయడానికి సెబ్ అధికారులు, సిబ్బంది చురుగ్గా పని చేయాలని కోరారు. సారా కేసుల్లో పదే పదే పట్టుబడితే పీడీ యాక్టు కింద కేసులు పెట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో సెబ్ సీఐ గురుప్రసాద్, ఎస్ఐ లక్ష్మీనరసయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణస్వామి కల్యాణం


స్వామివారి కల్యాణం చేస్తున్న అర్చకులు

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం చిప్పిలి గ్రామంలోని చిట్టిఅన్నవరంలోని సత్యనారాయణ స్వామి, పద్మావతి అమ్మవారి కల్యాణం సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి నిత్య కల్యాణ మండపంలో ప్రత్యేకంగా ఏర్పాట చేసిన వేదికను సుగంధభరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలతో శోభయమానంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాల మధ్య అర్చకులు, పండితులు వేదమంత్రోచ్చరణతో కళ్యాణం జరిపించారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘ నాయకులు అమరనాథ్, రామకృష్ణ, జ్ఞానోదయ ప్రసాద్, కోదండరామయ్య, రమణరావు తదితరులు పాల్గొన్నారు.